క్లుప్తంగా

రైస్ కార్డుల మంజూరుకు వినతి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగ విరమణ పొందిన తమకు రైస్‌కార్డు మంజూరు చేయాలని పలువురు పెన్షనర్లు కోరారు. ఆల్ పర్సనల్ రిటైర్మెంట్ పర్సన్ అసోసియేషన్ నాయకులు స్థానిక సచివాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి,ఉద్యోగ విరమణ పొందిన తమకు అతి తక్కువ పెన్షన్ వస్తోందన్నారు. దాని ఆధారంగా రైస్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. దీనబంధు, అప్పలరాజు, గురునాథ్, వెంకటరావు, పైడియ్య, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ



యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: విద్యార్థులు యోగా సాధన చేయడం ద్వారా చదువులో చురుకుదనం పెంపొందడంతో పాటు ఒత్తిడి దూరమవుతుందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు వారాల యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ఆశ్రమానికి వితరణ



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

గాజువాక: స్థానిక స్ఫూర్తి నిరాధార బాలల ఆశ్రమానికి బీజేపీ గాజువాక కన్వీనర్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. తమ కుమార్తె సాహితి జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు భోజనం నిమిత్తం ఈ సహాయం అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు కేకులు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

రైతుబజారులో 'మరుగు' సమస్య

పెదగంట్యాడ: స్థానిక రైతుబజార్‌లో తాగు నీరు, మరుగు సమస్యలతో మహిళా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుబజార్‌లో సుమారు 20 వరకు స్టాళ్లు ఉన్నాయి. అందులో అధికశాతం మహిళా రైతులు ఉంటున్నారు. వీరంతా వేకువజామున 6 గంటలకే ఇక్కడికి బస్సుల్లో, ఆటోల్లో చేరుకుంటున్నారు. నిత్యం వందలాది మంది కొనుగోలుదారులు వస్తుంటారు. వీరంతా మరుగు సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి సురక్షిత తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకు అన్యాయం'

అగనంపూడి: హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమాలు, స్థానికులకు జరుగుతున్న అన్యాయాలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో తెలుగు వారికి, ముఖ్యంగా స్థానికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎంపికల్లో అర్హులు ఉన్నా, వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి మాత్రమే అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి బయటపడతాయనే కారణంగా స్థానికులకు అవకాశం కల్పించడం లేదని.. గతంలో నియమించిన వారిని కూడా ఏదో నెపంతో తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అర్హత లేనివారిని కూడా కొన్ని విభాగాల్లో డిపార్ట్‌మెంట్ హెడ్‌లుగా నియమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి స్థానికులను చిన్న చూపు చూడడం, పనిచేసే వారిని వేధించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆస్పత్రి యాజమాన్యం వైఖరి మార్చుకోకుంటే స్థానికులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

హైవేపై జంక్షన్ల ఆధునికీకరణ

- పాత గాజువాకలో పూర్తి కావచ్చిన పనులు
- లంకెలపాలెంలో పనులకు భూమిపూజ
- మరో మూడు జంక్షన్లకు టెండర్ల ఖరారు

గాజువాక: గాజువాక ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులపై అధికారులు దృష్టి సారించారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా వాహనాలు కూడా విపరీతంగా పెరగడం, ట్రాఫిక్ సమస్యలు చోటుచేసుకోవడంతో వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం జాతీయ రహదారిపై గల పలు జంక్షన్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. పాతగాజువాక జంక్షన్ విస్తరణ, ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తి కావస్తుండగా లంకెలపాలెం జంక్షన్‌ను కూడా విస్తరించేందుకు భూమిపూజ చేశారు. గాజువాకలో మరో మూడు ప్రధాన జంక్షన్లను విస్తరించేందుకు జీవీఎంసీ అధికారులు టెండర్లు ఖరారు చేశారు.

రూ.54లక్షలతో పాతగాజువాక జంక్షన్ విస్తరణ

పాతగాజువాక జంక్షన్ విస్తరణ, ఆధునికీకరణ పనులను జీవీఎంసీ అధికారులు రూ.54 లక్షల వ్యయంతో చేపట్టిన విషయం తెలిసిందే. జంక్షన్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రోడ్లను విస్తరించి ఆధునికీకరించేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. ఈ జంక్షన్‌లో జాతీయ రహదారితో పాటు కొత్తగాజువాక మెయిన్ రోడ్, జాతీయ రహదారికి కణితి రోడ్‌ను అనుసంధానించే 60 అడుగుల రోడ్‌లో నిరంతరం భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక రోడ్‌లో నుంచి మరో రోడ్‌లోకి వాహనాలు వెళ్తున్న సమయంలో సిగ్నలింగ్ దృష్ట్యా సమస్యలు ఎదురవుతున్నాయి. దీన్ని పరిష్కరించాలంటే జంక్షన్‌ను విస్తరించడంతో పాటు ఆధునికీకరించడమే మార్గమని ట్రాఫిక్ పోలీసులు సూచించడంతో జీవీఎంసీ అధికారులు పనులను చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు చివరిదశలో ఉన్నాయి.



పాతగాజువాక జంక్షన్‌లో జరుగుతున్న విస్తరణ పనులు

లంకెలపాలెంలోని జంక్షన్లో త్వరలోనే పనులు

79, 85 వార్డుల కూడలిగా ఉన్న లంకెలపాలెం జంక్షన్ విస్తరణ పనులకు అధికారులు భూమిపూజ చేశారు. రూ.43లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్న విషయం తెలిసిందే. జంక్షన్‌లో గందరగోళ సమస్యలు ఉండటంతో ఇక్కడ రోడ్డు ప్రమాదాలు కూడా జనాన్ని భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. రహదారి విస్తరణ, ఫ్రీలెఫ్ట్‌లను ఏర్పాటు చేస్తూ జంక్షన్‌ను ఆధునికీకరించనున్నారు.



గాజువాక ఆటోనగర్ జంక్షన్

ఈ మూడు జంక్షన్లకు మహర్దశ

జాతీయ రహదారిపై గల శ్రీనగర్ జంక్షన్, వందడుగుల రోడ్ జంక్షన్, ఆటోనగర్ జంక్షన్లను త్వరలో విస్తరించేందుకు అధికారులు టెండర్లను ఖరారు చేశారు. ఈ జంక్షన్లను కూడా 15వ ఆర్థిక సంఘం నిధులతోనే ఆధునికీకరించనున్నారు. గాజువాక ఆటోనగర్‌కు ఒక వైపు శ్రీనగర్ జంక్షన్, మరోవైపు ఆటోనగర్ జంక్షన్ అనుసంధానమై ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ జంక్షన్లకు భారీ వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ కారణంగా శ్రీనగర్ జంక్షన్ వద్ద నిరంతరం ట్రాఫిక్ జామ్ అయిపోవడంతో పాటు అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా చోటు చేసుకొంటున్నాయి. కాగా, గంగవరం పోర్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లకు వెళ్లే ప్రధాన రవాణా వాహనాలకు వందడుగుల రోడ్ జంక్షన్ అనుసంధానమై ఉంటుంది. దీంతో ఈ జంక్షన్ కూడా భారీ వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మూడు జంక్షన్‌లను కూడా విస్తరించేందుకు అధికారులు టెండర్లను ఖరారు చేశారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

- నేడు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు
- 11న భారీ నిరసన ప్రదర్శనలు
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ప్రజల అభీష్టం మేరకు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 848వ రోజు పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన కార్మికులందరు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విశాఖ పర్యటన నేపథ్యంలో.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు ఉద్యమం ప్రారంభించి 850 రోజులు పూర్తవుతున్న సందర్భంగా కూర్మన్నపాలెం కూడలిలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నామని తెలిపారు. 11వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే నిరసన కార్యక్రమానికి ఉక్కు కార్మికులు, ఉద్యోగులు, స్టీల్‌ప్లాంట్ భూనిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని ఉక్కు ఉద్యమం సత్తా ఏంటో కేంద్ర ప్రభుత్వ పెద్దలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రహదారి నిర్మాణానికి అధికారుల పరిశీలన



అక్కిరెడ్డిపాలెం ప్రధాన రోడ్డును పరిశీలిస్తున్న జెడ్సీ సింహాచలం, ఏసీపీ అరుణవల్లి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో సర్వీసు రోడ్డు నుంచి గ్రామంలోకి ప్రవేశించే రోడ్డు నిర్మాణ విషయమై గాజువాక జెడ్సీ పి.సింహాచలం, ఏసీపీ అరుణవల్లి శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. కొద్ది నెలల క్రితం అన్నిరకాల అనుమతులతో సరిగ్గా రోడ్డు నిర్మాణం చేపడుతున్న సమయంలో టీడీపీ నాయకుడు గోగినేని సుధాకర్ కోర్టు స్టే ఆర్డర్ తెచ్చి పనులను ఆపివేయించారు. ప్రస్తుతం గ్రామంలో ప్రవేశించే రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా పరిస్థితిని పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అధికారులను కోరడంతో వారు శుక్రవారం రోడ్డు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు సంద్రాన నూకరాజు, బొడ్డు వెంకటరమణ, కామాడ రాంబాబు, వనమాడ అప్పలరాజు, కె.సత్యారావు, అంగ శ్రీను తదితరులు అధికారులతో మాట్లాడుతూ తమ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బంది పడుతున్నామని అధికారులకు తెలిపారు. అనంతరం ఇదే టీడీపీ నాయకుడిదిగా చెబుతున్న షాపు వెనుక వైపు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను జెడ్సీ పరిశీలించారు. వాటర్ ప్లాంట్ అనుమతుల పత్రాలను చూపమనడంతో సదురు యజమాని ఆ పత్రాలను కార్యాలయానికి వచ్చి చూపుతానని ఫోనులో జెడ్సీతో సంభాషించారు. వాటర్ ప్లాంట్‌కు అవసరమైన బోరును రోడ్డు స్థలంలో ఏర్పాటు చేయడంతో, దానిని కూడా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. ఏది ఏమైనా, గ్రామంలోకి ప్రవేశించే రోడ్డును విస్తరించి, నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ముక్తకంఠంతో అధికారులను కోరారు.

యోగా, పవర్‌లిఫ్టింగ్ విజేతలకు సత్కారం

పెదగంట్యాడ: ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించిన అండిబోయిన లక్ష్మీ, పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన అండిబోయిన అప్పారావును ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి స్వర్ణ పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, యువశ్రీ, వెంపాడ అప్పారావు, రంబ నారాయణమూర్తి, మంత్రి శంకరనారాయణ, గొందేశి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



అండిబోయిన అప్పారావు, లక్ష్మిలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

శ్మశానవాటికలో తుప్పల తొలగింపు



శ్మశానవాటికలో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు గంగవరం రహదారిని ఆనుకొని, విశాఖ విమల విద్యాలయం సమీపంలోని శ్మశాన వాటికలో శుక్రవారం తుప్పలు తొలగించారు. ఈ శ్మశాన వాటికలో తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ జేసీబీ సాయంతో తుప్పల తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, వెంకటేష్, పిట్టారెడ్డి, నందికి తాతారావు, గొందేశి సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారం

గాజువాక: నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యలను తెలుసుకొని మరీ పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 67వ వార్డులోని జోగవానిపాలెం, అశోక్‌నగర్, మారుతీ నగర్, గణేష్‌నగర్‌లలో రూ.1.36 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించడానికి అధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు సూర్యనారాయణ, అచ్చింనాయుడు, పల్లా పెంటారావు, నాయుడు, మీరాభాయి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

'ఉక్కు' అమ్మకాన్ని విరమించినట్లు అమిత్ షా ప్రకటించాలి

ఉక్కునగరం/పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా విశాఖ పర్యటనకు నిరసనగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేయనున్న కార్యక్రమాలపై శుక్రవారం స్టీల్‌ప్లాంట్ గేట్ల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీసుకుందన్నారు. ఈ అంశంపై నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నా స్పందించకపోవడం అన్యాయమన్నారు. అమిత్‌షా పర్యటన నేపథ్యంలో ఈ నెల 10,11 తేదీల్లో అన్ని విభాగాల్లో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతారన్నారు. అదే విధంగా 11న కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉన్న దీక్షా శిబిరం వద్దకు వేలాదిగా కార్మికులు, నిర్వాసితులు వచ్చి తమ వ్యతిరేకతను తెలపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, జె.రామకృష్ణ, డి.అప్పారావు, ఎం.వెంకటరావు, చీకటి శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, టి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ సభ్యులు